

3

తల్లాడలో పారిశుద్ధ్యం గాలికి..


అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



WANTED రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103



సంపుటి - 3 సంచిక -29 శనివారం 27 జూన్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు 5 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Districts


# డ్రగ్స్ రహిత తెలంగాణ లక్ష్యం

## ఈగిల్ ఫోర్స్ డ్రగ్స్ నిర్మూలన కార్యక్రమంలో భట్టి

**డ్రగ్స్‌పై పోరాటంలో ఈగిల్ ఫోర్స్ కృషి అసామాన్యం**

**డ్రగ్స్ బారిన పడకుండా యువత జాగ్రత్త పడాలి**



**హైదరాబాద్,జూన్ 26 (జర్నలిస్ట్ వార్త):**
విలువైన జీవితాన్ని డ్రగ్స్ బారిన పడి నాశనం చేసుకోవద్దని విద్యార్థులు, యువతకు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. డ్రగ్స్ రహిత తెలంగాణను నిర్మించడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. ఈ మహమ్మారి నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని, అందరం కలిసికట్టుగా పోరాడినప్పుడే డ్రగ్స్ లేని సమాజాన్ని సాధించగలమని పిలుపునిచ్చారు.మిగతా 2లో...

# డిజిటల్ పురోగతితో ఆర్థిక సాధికారత



**ఆర్థిక సమ్మిళితం, డిజిటల్ పురోగతి**

**ప్రపంచ వ్యాప్తంగా డిజిటల్ విప్లవం**

**ప్రజల జీవన ప్రమాణాల పెంపు**

**ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వెల్లడి**

**నెదర్లాండ్స్ క్వీన్ మాక్సిమాతో భేటీ**

**డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై చర్చ**

**న్యూఢిల్లీ,జూన్ 26 (జర్నలిస్ట్ వార్త):**
ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ప్రత్యేక ప్రతినిధి (ఫైనాన్షియల్ హెల్త్), నెదర్లాండ్స్ రాణి అయిన క్వీన్ మాక్సిమా గురువారం న్యూఢిల్లీలో సమావేశమయ్యారు. వీరిద్దరి మధ్య జరిగిన ఈ కీలక భేటీలో, భారతదేశంలో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ద్వారా ఆర్థిక సేవలు మిగతా 2లో...

# డ్రగ్స్‌పై పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములే

**ఈ మహమ్మారిని తరిమి కొట్టడంలో కలసి రండి**

**ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు**



**హైదరాబాద్,జూన్ 26 (జర్నలిస్ట్ వార్త):**
సమాజాన్ని నాశనం చేస్తున్న డ్రగ్స్‌పై పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు కీలక సందేశాన్ని ఇచ్చారు. తెలంగాణను డ్రగ్స్ లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.మిగతా 2లో...

# రాహుల్ గాంధీపై 'మిస్సింగ్' పోస్టర్లు...

**రాహుల్ విదేశీ పర్యటనలే లక్ష్యంగా బీజేపీ విమర్శలు**

**'లాపతా రాహుల్' పేరుతో సామాజిక మాధ్యమాల్లో పోస్టర్లతో క్యాంపెయిన్**

**రాహుల్ ప్రపంచస్థాయి నాయకుడని కాంగ్రెస్ కౌంటర్**

**బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం**

**న్యూఢిల్లీ,జూన్ 26 (జర్నలిస్ట్ వార్త):**
ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తరచూ చేపడుతున్న విదేశీ పర్యటనలను లక్ష్యంగా చేసుకుని బీజేపీ తీవ్ర విమర్శలు గుప్పిస్తోంది. ఈ మేరకు 'మిస్సింగ్ రాహుల్ (లాపతా రాహుల్)' పేరుతో సరికొత్త పోస్టర్ ప్రచారాన్ని ప్రారంభించింది. ఆయన పర్యటనల కోసం చేస్తున్న ఖర్చులపై ప్రశ్నలుమిగతా 2లో...



# ఆపరేషన్ సిందూర్ లో ఆరుగురు అమరులు

**ఏడాది తర్వాత జవాన్ల పేర్లు ప్రకటించిన కేంద్రం**

**నేషనల్ వార్ మెమోరియల్ వెబ్‌సైట్‌లో**

**'రోల్ ఆఫ్ ఆనర్-2025'లో చోటు**

**తెలుగు అగ్నివీర్ మురళీ నాయక్ సహా**

**ఆరుగురికి దేశం నివాళి**

**న్యూఢిల్లీ,జూన్ 26 (జర్నలిస్ట్ వార్త):**
పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లో దేశం కోసం ప్రాణాలు అర్పించిన ఆరుగురు అమరవీరుల పేర్లను కేంద్ర ప్రభుత్వం తొలిసారి అధికారికంగా వెల్లడించింది. దేశ రక్షణలో అసమానమిగతా 2లో...




# ఆడబిడ్డల ఖాతాల్లో డబ్బులేశారా?

**నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటా**

**ప్రతి ఓటునూ దగ్గరుండి మ్యాపింగ్ చేయించాలి :(బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరిగిలో నియోజకవర్గ స్థాయి సమావేశం**





# తెలంగాణకు భారీ వర్షసూచన

**అరెంజ్ అలర్ట్ జారీ చేసిన వాతావరణశాఖ**

# తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సంజయ్ జాజు

**సీఎం సలహాదారుడిగా రామకృష్ణారావు**

**మొత్తం 13 మంది ఐఏఎస్‌ల బదిలీ.. ఉత్తర్వులు జారీ**

**హైదరాబాద్జూన్ 26 (జర్నలిస్ట్ వార్త):**
రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శి(సీఎస్)గా సీనియర్ ఐఏఎస్ సంజయ్ జాజు నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం సీఎస్‌గా ఉన్న కె.రామకృష్ణారావు మిగతా 2లో...



# దేశంలో 'ఈజీ కనెక్ట్' ప్రారంభం..

**ఇకపై బయలుదేరే ఎయిర్‌పోర్టులోనే అంతర్జాతీయ ప్రయాణ లాంఛనాలు**

**వారణాసి నుంచి తొలి 'ఈజీ కనెక్ట్' విమాన సర్వీస్ ప్రారంభం**

**టైర్-2, టైర్-3 నగరాల నుంచి అంతర్జాతీయ ప్రయాణాలు సులభతరం**

**న్యూఢిల్లీ,జూన్ 26 (జర్నలిస్ట్ వార్త):**
టైర్-2, టైర్-3 నగరాల నుంచి అంతర్జాతీయ ప్రయాణాలు చేసే వారికి కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. విదేశాలకు వెళ్లే ప్రయాణికుల కోసం నూతన విధానంలో భాగంగా 'ఈజీ కనెక్ట్' విమాన సేవలను ప్రారంభించింది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి మిగతా 2లో...



# డ్రగ్స్‌పై పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములే

మాదక ద్రవ్యాల మహమ్మారి కేవలం ఒక వ్యక్తిని మాత్రమే కాకుండా, వారి కుటుంబాలతో పాటూ మొత్తం సమాజాన్నే నాశనం చేస్తుందన్నారు. డ్రగ్స్ బారిన పడకుండా యువత ఎల్లప్పుడూ వీటికి దూరంగా ఉండాలని సీఎం హితవు పలికారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకమని, అందుకోసం వారు స్వచ్ఛందంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేవలం చట్టాలు, పోలీసుల చర్యల వల్లే కాకుండా.. ప్రజల్లో సరైన అవగాహన పెంచడం ద్వారానే మాదక ద్రవ్యాల నియంత్రణ పూర్తిగా సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా అక్రమ డ్రగ్స్ రవాణాను అరికట్టేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ సామాజిక బాధ్యతగా భావించి సహకరించాలని కోరారు. యువత డ్రగ్స్ వైపు వెళ్లకుండా ఉండేందుకు.. వారిలో సానుకూల ఆలోచనలు, నైతిక విలువలను పెంపొందించడం ఎంతో ముఖ్యమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సమాజంలో మాదక ద్రవ్యాల వల్ల జరిగే నష్టాలపై నిరంతరం అప్రమత్తత పెంచాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మహమ్మారిని రూపుమాపడానికి అందరం కలిసికట్టుగా చేసే సమిష్టి పోరాటమే శాశ్వత పరిష్కారమని, డ్రగ్ ఫ్రీ తెలంగాణ కోసం ప్రతి పౌరుడూ నడుం బిగించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

# రాహుల్ గాంధీపై ‘మిస్సింగ్‘ పోస్టర్లు

**మొదటిపేజీ తరువాయి**

సంధిస్తూ సామాజిక మాధ్యమాల్లో ఈ క్యాంపెయిన్‌ను ఉద్ధృతం చేసింది.
ఈ ప్రచారంలో భాగంగా పలు సినిమా పోస్టర్లను మార్ఫింగ్ చేస్తూ బీజేపీ నేతలు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. “ఛడ్ దే ఇండియా“, “రాహుల్ ఇన్ పారిస్“, “పరదేశ్“ వంటి పేర్లతో వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. ప్రతిపక్ష నాయకుడి హోదాను ‘పర్యటనల నేత‘గా మార్చాలని కొందరు బీజేపీ అధికార ప్రతినిధులు ఎద్దేవా చేశారు. ఢిల్లీ బీజేపీ యూనిట్ “స్వదేశ్ వర్సెస్ పరదేశ్“ పేరుతో పోస్టర్ విడుదల చేయగా, గోవా బీజేపీ రాహుల్ గాంధీ థాయ్‌లాండ్‌లో విహారయాత్ర చేస్తున్నారా? అంటూ ప్రశ్నించింది. బీజేపీ నేతలు షెహజాద్ పూనావాలా, ఆర్పీ సింగ్ వంటి వారు రాహుల్ పర్యటనల ఖర్చు, పారదర్శకతపై తీవ్ర ఆరోపణలు చేశారు. రాహుల్ గాంధీ ఇప్పటివరకు సుమారు 55 సార్లు విదేశీ పర్యటనలు చేశారని, వీటికి దాదాపు రూ.60 కోట్లకు పైగా ఖర్చయి ఉండవచ్చని వారు అంచనా వేశారు. ఆయన వెల్లడించిన ఆదాయానికి, ఈ పర్యటనల ఖర్చులకు ఏమాత్రం పొంతన లేదని, ఈ పర్యటనలకు నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయో బహిర్గతం చేయాలని వారు డిమాండ్ చేశారు.
అయితే, బీజేపీ చేస్తున్న విమర్శలను కాంగ్రెస్ పార్టీ అంతే ధీటుగా తిప్పికొట్టింది. రాహుల్ గాంధీ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన నాయకుడని, ప్రపంచవ్యాప్తంగా ఆయనకు ఆహ్వానాలు అందుతుంటాయని పేర్కొంది. ఇవన్నీ కేవలం రాజకీయ ప్రేరేపిత ఆరోపణలని కొట్టిపారేసింది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సల్మాన్ ఖుర్షీద్ ఈ విషయంపై స్పందిస్తూ, “రాహుల్ గాంధీ కేవలం మన దేశ నాయకుడే కాదు, ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది ఆయన్ను గొప్ప నాయకుడిగా భావిస్తారు. అందుకే వివిధ దేశాలు, అంతర్జాతీయ సంస్థల నుంచి ఆయనకు నిరంతరం ఆహ్వానాలు వస్తుంటాయి“ అని స్పష్టం చేశారు.

# తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సంజయ్ జాజు

**మొదటిపేజీ తరువాయి**

ఈనెల 30న పదవీ విరమణ చేయనున్నారు. ఆయన్ను సీఎం సలహాదారుగా ప్రభుత్వం నియమించింది. ఈ నేపథ్యంలో రామకృష్ణారావు స్థానంలో సంజయ్ జాజు సీఎస్‌గా నియమితులయ్యారు. కేంద్ర సర్వీసులో ఈశాన్య ప్రాంత అభివృద్ధి కార్యదర్శిగా పని చేస్తున్న ఆయన్ను తెలంగాణ రాష్ట్రానికి పంపుతూ కేంద్ర ప్రభుత్వం మంగళవారం నిర్ణయం తీసుకుంది. 1992 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన సంజయ్ జాజు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ సబ్ కలెక్టర్‌గా, పశ్చిమగోదావరి కలెక్టర్‌గా, హైదరాబాద్ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా, కమిషనర్‌గా, పౌరసరఫ రాల సంస్థ కమిషనర్‌గా పని చేశారు. 2014 నుంచి కేంద్ర సర్వీసులో ఉన్నారు. ఆయన 2029 ఫిబ్రవరి వరకు సర్వీసులో కొనసాగనున్నారు. కాగా రాష్ట్రంలో మొత్తం 13 మంది ఐఏఎస్ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. చేనేత హస్తకళల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సవ్యసాచి ఘోష్‌కు బాధ్యతలు అప్పగించింది. అటవీశాఖ ముఖ్య కార్యదర్శిగా శైలజా రామయ్యర్‌ను నియమించిన ప్రభుత్వం.. దేవాదాయశాఖ ముఖ్యకార్యదర్శిగా ఆమెకు అదనపు బాధ్యతలు అప్పగించింది. జీఏడీ (పొలిటికల్) ముఖ్య కార్యదర్శిగా అహ్మద్ నదీమ్‌ను నియమించింది. మైనారిటీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిగా ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించారు. సీఎం ముఖ్య కార్యదర్శిగా ఎన్.శ్రీధర్ నియమితులయ్యారు. రెవెన్యూ శాఖ (విపత్తు నిర్వహణ) ముఖ్య కార్యదర్శిగా రాహుల్ బొజ్జాను, ప్రభుత్వ (మైన్స్ అండ్ జియాలజీ) కార్యదర్శిగా ఎం.రఘునందన్ రావును, ఇన్వెస్ట్ తెలంగాణ, ఐ అండ్ సి డిపార్ట్ మెంట్ సీఈవోగా బి.అజిత్ రెడ్డిని నియమించారు. టీజీరెడ్కో వీసీ అండ్ ఎండీగా మహమ్మద్ ముషారఫ్ అలీ పారూఖీ, హ్యాండ్లూమ్స్, టెక్స్ టైల్స్, హ్యాండిక్రాఫ్ట్స్ ప్రత్యేక కార్యదర్శిగా పి.కాత్యాయని దేవి, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శిగా కె.గంగాధర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మున్సిపల్ కమిషనర్ గా టి.వెంకన్న, టూరిజం డైరెక్టర్ గా కె.విద్యాసాగర్ నియమితులయ్యారు. విద్యాసాగర్ సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ ఆఫీసర్ గా అదనపు బాధ్యతలను నిర్వర్తించనున్నారు. కె.చంద్రకళకు హెచ్ ఎండీఏ (కోర్ అర్బన్ రీజియన్, ల్యాండ్ పూలింగ్ అండ్ మెట్రో రైల్) జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్ గా ప్రభుత్వం అదనపు బాధ్యతలను అప్పగించింది. రాష్ట్ర అటవీ ప్రధాన సంరక్షణ అధికారిగా వినయ్ కుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. సీఎంవో ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్‌రెడ్డిని ఇన్వెస్ట్ తెలంగాణ సీఈవోగా బదిలీ చేసింది. సీఎంవో ముఖ్య కార్యదర్శిగా ఎన్.శ్రీధర్‌ను నియమించింది.ం

# దేశంలో ‘ఈజీ కనెక్ట్‘ ప్రారంభం..

**మొదటిపేజీ తరువాయి**

రామ్మోహన్ నాయుడు శుక్రవారం వారణాసిలోని లాల్ బహదూర్ శాస్త్రి అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి తొలి సర్వీస్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ కొత్త విధానంతో... ఇకపై చిన్న నగరాల నుంచి విదేశాలకు వెళ్లే ప్రయాణికులు తాము బయలుదేరే విమానాశ్రయంలోనే చెక్-ఇన్, ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ వంటి లాంఛనాలన్నీ పూర్తి చేసుకోవచ్చు. ఉదాహరణకు, వారణాసిలో అంతర్జాతీయ ప్రయాణం మొదలుపెట్టే వారు అక్కడే అన్ని ఫార్మాలిటీస్ పూర్తి చేసి, దేశీయ విమానంలో ఢిల్లీ వంటి ఇంటర్నేషనల్ హబ్ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి ఎలాంటి తనిఖీలు లేకుండా నేరుగా అంతర్జాతీయ విమానం ఎక్కవచ్చు. ఈ సందర్భంగా మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. విమాన ప్రయాణాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, భారత విమానయాన రంగాన్ని ప్రపంచంలోనే పోటీపడేలా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. “భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా, స్వయం సమృద్ధి కలిగిన ఏవియేషన్ రంగాన్ని నిర్మించడంలో ఇది ఒక కీలక ముందడుగు“ అని ఆయన తెలిపారు. ఈ ‘ఈజీ కనెక్ట్‘ వ్యూహంతో 2030 నాటికి భారత్‌ను ప్రయాణికులకు ప్రాధాన్య ఏవియేషన్ హబ్‌గా, 2047 నాటికి గ్లోబల్ ఏవియేషన్ హబ్‌గా మార్చాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ విధానం వల్ల పర్యాటకం, వాణిజ్యం, పెట్టుబడులు పెరిగి ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. దీని ద్వారా 2030 నాటికి దాదాపు 4 లక్షల ఉద్యోగాలు, 30 బిలియన్ డాలర్ల అదనపు జీడీపీ సమకూరుతుందని అంచనా.

# తెలంగాణకు భారీ వర్షసూచన

## అరెంజ్ అలర్ట్ జారీ చేసిన వాతావరణశాఖ

**హైదరాబాద్,జూన్ 26 (జర్నలిస్ట్ వార్త):**

తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. జూన్ 27వ తేదీ నుంచి జులై 2వ తేదీ వరకు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ నేపథ్యంలోనే తెలంగాణకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రానున్న రెండు రోజుల్లో హైదరాబాద్ నగరంలో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొంది. వర్షంతో పాటు ఉరుములు, మెరుపులు సంభవిస్తాయని తెలిపింది. గంటకు 40?50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని వెల్లడించింది. మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ పేర్కొంది. ఆ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. హైదరాబాద్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, జగిత్యాల, కరీంనగర్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్ధిపేట, యాదాద్రి, రంగారెడ్డి, మేడ్చల్, మహబూబ్‌నగర్ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

# డ్రగ్స్ రహిత తెలంగాణ లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి**

డ్రగ్స్‌ను అరికట్టడానికి ప్రత్యేకంగా పనిచేస్తున్న ఈగల్ ఫోర్స్‌కు ఆర్థికంగా ఎలాంటి లోటు రాకుండా ప్రభుత్వం అన్ని విధాలా పూర్తి సహకారాన్ని అందిస్తుందని భరోసా ఇచ్చారు. తమ పిల్లలు ఉన్నత స్థానాల్లో ఉండాలని కోరుకునే తల్లిదండ్రుల ఆశ, రాష్ట్ర ప్రభుత్వ కల ఒక్కటేనని.. అది యువత డ్రగ్స్ బారిన పడకుండా ఉండటమేనని ఉద్ఘాటించారు. శిల్పకళా వేదికలో నిర్వహించిన ఈగల్ ఫోర్స్ యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, డీజీపీ సీవీ ఆనంద్, సినీనటులు రామ్ పోతినేని, మీనాక్షి చౌదరి పాల్గొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తారు. ఈ ప్రభుత్వం కూడా వారిని కాపాడుకోవాలని ప్రయత్నిస్తోంది. సమాజ శ్రేయస్సు కోసం పోలీసులు ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొంటున్నారు. తమ జీవితాలను రిస్క్‌లో పెట్టి డ్రగ్స్ ముఠాలను పట్టుకుంటున్నారు. డ్రగ్స్ కేసుల్లో దొరికితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని భట్టి హెచ్చరించారు. ఈగల్ ఫోర్స్ సంపూర్ణంగా పనిచేసేలా అన్ని వసతులు కల్పించాం. డ్రగ్స్ కట్టడికి ఎలాంటి కఠిన నిర్ణయమైనా తీసుకుంటాం. తెలంగాణలో పుట్టిపెరగడం ఓ భరోసాగా




భావించే పరిస్థితులు కల్పిస్తున్నాం. సమాజంలో పరివర్తన రాకుంటే ఎన్ని చట్టాలు చేసినా ప్రయోజనం శూన్యం. సినీ నటులు ఇచ్చే సందేశం సమాజంలోకి బలంగా వెళుందని భట్టి విక్రమార్క అన్నారు. డ్రగ్స్ నిర్మూలన కోసం ప్రాణాలకు తెగించి, నిరంతరం రిస్క్‌లో పనిచేస్తున్న పోలీస్ అధికారుల, సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని, అందులో భాగంగానే అలాంటి ఉద్యోగులకు ప్రత్యేక ఇన్సెంటివ్స్ అందిస్తున్నట్లు డిప్యూటీ సీఎం ప్రకటించారు. పిల్లల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తు అని నమ్ముతూ, డ్రగ్స్ మహమ్మారిపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రత్యేక అవేర్‌నెస్ కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపడుతున్నట్లు వివరించారు. ముఖ్యంగా విద్యావ్యవస్థ బలోపేతం, రాష్ట్ర రక్షణ విషయాలలో ప్రభుత్వం ఎంతో కఠినంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. డ్రగ్స్ రవాణా లేదా వినియోగంలో ఎంతటి పెద్దవారు, ఎంతటి ప్రభావశీలురు ఉన్నా సరే ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తి లేదని భట్టి విక్రమార్క తీవ్రంగా హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చలనచిత్ర రంగానికి చెందిన హీరోలు, హీరోయిన్లు, ఇతర కళాకారులు డ్రగ్స్ వ్యతిరేక ప్రచారంలో చురుగ్గా పాల్గొనాలని శిల్పకళా వేదిక నుంచి ఆయన విజ్ఞప్తి చేశారు. సినీ పరిశ్రమలో ఉన్నవారు కూడా సమాజం పట్ల బాధ్యతగా మెలగాలని, డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రభుత్వానికి తమవంతు సహకారం అందించాలని కోరారు. ప్రభుత్వం తరఫున కఠినమైన చట్టాలు చేస్తున్నప్పటికీ, ప్రజల్లో మార్పు రానంతవరకు ఆశించిన ఫలితాలు రావని డిప్యూటీ సీఎం అభిప్రాయపడ్డారు. దేశంలో వరకట్న నిషేధ చట్టం ఉన్నప్పటికీ, అది ఆశించిన స్థాయిలో అమలు కాకపోవడానికి సామాజిక మార్పు లోపించడమే కారణమని ఉదాహరించారు. డ్రగ్స్ నిర్మూలన వంటి కఠినమైన చట్టాలు వంద శాతం విజయవంతం కావాలంటే, చట్టాలతో పాటు సమాజంలో, ప్రజల ఆలోచనా విధానంలో స్పష్టమైన పరివర్తన రావాలని ఆయన ఆకాంక్షించారు.

# ఆడబిడ్డల ఖాతాల్లో డబ్బులేశారా?

**నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటా**

**ప్రతి ఓటునూ దగ్గరుండి మ్యాపింగ్ చేయించాలి :(బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**పరిగిలో నియోజకవర్గ స్థాయి సమావేశం**

**పరిగిజూన్ 26 (జర్నలిస్ట్ వార్త):**

రాష్ట్రంలోని కోటి 67 లక్షల మంది ఆడబిడ్డల ఖాతాల్లో ఒకొక్కరికి రూ.లక్ష 50వేలు జమ చేస్తే తాను శాశ్వతంగా రాజకీయ సన్యాసం తీసుకుంటానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. ప్రతి ఓటునూ దగ్గరుండి మ్యాపింగ్ చేయించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా పరిగి పట్టణ కేంద్రంలోని ఎస్ గార్డెన్‌లో మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి అధ్యక్షతన బీఆర్ఎస్ ఎస్ఐఆర్, సభ్యత్వ నమోదు కార్యక్రమంపై కార్యకర్తలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో కేసీఆర్ పరిగి వచ్చినప్పుడు ‘కాంగ్రెస్‌ను నమ్మొద్దు.. నమ్మి మోసపోతే గోస పడతారు’ అని చెప్పారని గుర్తు చేశారు. పరిగి అంటేనే రైతులు, రైతు బిడ్డలు ఉండే వ్యవసాయ ప్రాంతమని అన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు.. నాట్లు వేసేటప్పుడు రైతుబంధు పడేదని, కానీ ఈ ప్రభుత్వంలో ఎందుకు పడటం లేదని ప్రశ్నించారు. భూములకు పట్టాలిస్తామని చెప్పి, పారిశ్రామిక వాడ పేరుతో, రోడ్ల పేరుతో భూములు గుంజుకుంటున్నాడని ఆరోపించారు. ఉద్దండపూర్ ప్రాజెక్టు నుంచి కాలువలు తవ్వితే పరిగికి, కొడంగల్‌కి లక్ష ఎకరాలకు నీరు వచ్చే విధంగా అన్ని సిద్ధం చేశామని అన్నారు. కానీ రేవంత్ రెడ్డి అధికారంలోకి రాగానే దాన్ని పక్కన పెట్టి కమీషన్ల కోసం రూ.4,400 కోట్లతో లిఫ్టు ఇరిగేషన్ తీసుకొచ్చాడని అన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పూర్తి చేసే దమ్ము కాంగ్రెస్ వాళ్లకి లేదని అన్నారు. లగచర్లలో భూములి యమన్న పాపానికి గిరిజన ఆడపిల్లలపై దాడి చేసి, అవమానించి ఒక దుస్సాసన పర్వాన్ని సృష్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. 36 మంది రైతులను జైల్లో పెట్టి హింసించారని ఆరోపించారు. కొడంగల్‌లో జరిగిన దుర్మార్గమే పరిగిలో కూడా జరుగుతుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీల భూముల ను ఇష్టానుసారంగా గుంజుకుంటున్నారని, అసైన్డ్ భూములని ఇష్టారాజ్యంగా తీసుకుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అవసరమైతే న్యాయ పోరాటం చేస్తామని అన్నారు. పరిగిలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎగిరేది గులాబీ జెండానే అని దీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రారంభమైందని అన్నారు. పరిగిలో ఇంకా 90వేల ఓట్లు మ్యాపింగ్ జరగాల్సి ఉందన్నారు. ఈ ఓట్లు ఎక్కడ మిస్ అయ్యాయో చూసి చేర్పించాలని సూచించారు. కొప్పుల మహేష్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందన్నారు. తమ పార్టీ నాయకులపై కేసులు పెడుతున్నారని తెలిపారు. పార్టీ అధికారం లోకి రావాలంటే కార్య కర్తలు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కార్యకర్తలు చురుగ్గా పాల్గొనాలని అన్నారు.

# డిజిటల్ పురోగతితో ఆర్థిక సాధికారత

**మొదటిపేజీ తరువాయి**

సామాన్యులకు ఏ విధంగా మరింత సులభంగా, సరసమైన ధరల్లో అందుబాటులోకి వచ్చాయనే అంశంపై ప్రధానంగా చర్చలు జరిగాయి. ఈ డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు సామాన్య పౌరుల జీవన ప్రమాణాలను ఏ విధంగా మారుస్తున్నాయో ఇద్దరు నేతలూ సుదీర్ఘంగా సమీక్షించారు. ధాని మోదీ తన (ట్విట్టర్) ఖాతా ద్వారా ఈ సమావేశం గురించి వివరిస్తూ, ఆర్థిక సమ్మిళితంలో ప్రపంచవ్యాప్తంగా బలమైన గొంతుకగా ఉన్న క్వీన్ మాక్సిమాను కలవడం సంతోషంగా ఉందని తెలిపారు. భారతదేశంలో ఆధార్, యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ , ప్రధాన మంత్రి జన్-ధన్ యోజన వంటి డిజిటల్ పబ్లిక్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా నడిచే డిజిటల్ విప్లవం.. ప్రజల జీవన ప్రమాణాల్ని ఏ విధంగా పెంచుతోందో వారు చర్చించారు. ఈ డిజిటల్ విధానాలు లక్షల మంది ప్రజలకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారికి, ఆర్థిక సాధికారత కల్పిస్తున్నాయని ఆయన ఈ సందర్భంగా వివరించారు. భారతదేశం సాధించిన ఈ సాంకేతిక, ఆర్థిక సమ్మిళిత అనుభవాలను ప్రపంచంలోని ఇతర భాగస్వామ్య దేశాలతో పంచుకోవడానికి భారత్ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. అభివృద్ధి చెందుతున్న, పేద దేశాలకు భారతదేశ మోడల్ ఒక ఖర్చు-తక్కువ, సులభతరమైన మార్గదర్శకంగా నిలుస్తుందని భారత ప్రభుత్వం పదేపదే తెలియజేస్తోంది. ఐక్యరాజ్యసమితి ఫైనాన్షియల్ హెల్త్ అడ్వకేట్‌గా తన మూడు రోజుల భారత పర్యటనలో భాగంగా క్వీన్ మాక్సిమా.. ముంబై, న్యూఢిల్లీలను సందర్శించారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ, భారతదేశం ఆర్థిక సమ్మిళితం, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో అద్భుతమైన ప్రగతిని సాధించిందని ప్రశంసించారు. ఒకప్పుడు కేవలం బ్యాంకింగ్ సేవలు అందించడం పైనే దృష్టి ఉండగా, ఇప్పుడు ఈ సాంకేతికతను ఉపయోగించి ప్రజల వాస్తవ ఆర్థిక ఆరోగ్యాన్ని ఎలా మెరుగుపరచాలన్నది ప్రధాన అంశంగా మారిందని ఆమె అన్నారు. ముంబై పర్యటనలో క్వీన్ మాక్సిమా కొందరు సాధారణ ప్రజలు, నర్సులు, యువతతో ముఖాముఖి చర్చలు జరిపారు. వారు తమ ఆర్థిక నిర్వహణ, బడ్జెటింగ్, పొదుపు కోసం డిజిటల్ యాప్‌లను ఎలా ఉపయోగిస్తున్నారో స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అట్టడుగు వర్గాల ప్రజలకు బ్యాంకింగ్ సేవలను ఉచితంగా అందించే ‘జన్ ధన్’ పథకం లబ్ధిదారులతో కూడా ఆమె ముచ్చటించి వారి సాధక బాధకాలను విన్నారు. డిజిటల్ చెల్లింపులు, సబ్సిడీల నేరు బదిలీ వంటి కార్యక్రమాలతో భారతదేశం ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షిస్తోంది. భవిష్యత్తులో అందరికీ సురక్షితమైన, అనుకూలమైన ఆర్థిక వ్యవస్థను సృష్టించడంలో క్వీన్ మాక్సిమా, ప్రధాని మోదీ మధ్య జరిగిన ఈ చర్చలు అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి.

# ఆపరేషన్ సిందూర్ లో ఆరుగురు అమరులు

**మొదటిపేజీ తరువాయి**

ధైర్యసాహసాలు ప్రదర్శించి వీరమరణం పొందిన ఆ జవాన్ల వివరాలను నేషనల్ వార్ మెమోరియల్ అధికారిక వెబ్‌సైట్‌లోని ‘రోల్ ఆఫ్ ఆనర్-2025’ జాబితాలో చేర్చారు. త్వరలో న్యూఢిల్లీలోని జాతీయ యుద్ధ స్మారకంలో ప్రత్యేక శిలాఫలకాలపై వారి పేర్లను శాశ్వతంగా చెక్కనున్నారు.’ఆపరేషన్ సిందూర్’లో భారత సైన్యానికి చెందిన ఐదుగురు, భారత వైమానిక దళానికి చెందిన ఒకరు వీరమరణం పొందారు. వీరిలో సుబేదార్ మేజర్ పవన్ కుమార్ (10 ఇన్‌ఫాంట్రీ బ్రిగేడ్ హెడ్‌క్వార్టర్స్), రైఫిల్‌మ్యాన్ సునీల్ కుమార్ (4వ బెటాలియన్, జమ్మూ కశ్మీర్ లైట్ ఇన్‌ఫాంట్రీ), లాన్స్ నాయక్ దినేశ్ కుమార్ (5 ఫీల్డ్ రెజిమెంట్), హవిల్దార్ సునీల్ కుమార్ సింగ్ (237 ఫీల్డ్ వర్క్‌షాప్), అగ్నివీర్ మురళీ నాయక్ (851 లైట్ రెజిమెంట్), భారత వైమానిక దళానికి చెందిన సార్జెంట్ సురేంద్ర కుమార్ ఉన్నారు. దేశం కోసం తమ ప్రాణాలను అర్పించిన వీరి సేవలను కేంద్ర ప్రభుత్వం అధికారికంగా గుర్తించి జాతీయ స్థాయిలో గౌరవించింది. ఈ అమరవీరుల్లో రైఫిల్‌మ్యాన్ సునీల్ కుమార్‌కు మరణానంతరం దేశంలోని మూడో అత్యున్నత యుద్ధ పురస్కారమైన ‘వీర చక్ర’ను ప్రకటించారు. అలాగే భారత వైమానిక దళానికి చెందిన సార్జెంట్ సురేంద్ర కుమార్‌కు ‘వాయుసేన మెడల్’ ప్రదానం చేశారు. ఇటీవల రాష్ట్రపతి భవన్‌లో జరిగిన రక్షణ పురస్కారాల కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా రైఫిల్‌మ్యాన్ సునీల్ కుమార్ తల్లిదండ్రులు వీరచక్రను అందుకున్నారు.

దేశ రక్షణలో చూపిన అసాధారణ ధైర్యానికి గుర్తింపుగా ఈ పురస్కారాలను కేంద్రం ప్రకటించింది. ఈ ఆరుగురిలో తెలుగు వ్యక్తి అగ్నివీర్ మురళీ నాయక్ పేరు ఉంది. ఆయన ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసత్యసాయి జిల్లా కళ్లితండాకు చెందినవారు. 2022లో అగ్నివీర్‌గా భారత సైన్యంలో చేరిన మురళీ నాయక్ తొలుత పంజాబ్, అసోంలో విధులు నిర్వహించారు. అనంతరం జమ్మూ కశ్మీర్ సరిహద్దుల్లో విధులు నిర్వర్తిస్తున్న సమయంలో ‘ఆపరేషన్ సిందూర్’లో భాగంగా పాకిస్తాన్‌తో జరిగిన ఎదురు కాల్పుల్లో వీరమరణం పొందారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన యువ సైనికుడు దేశం కోసం ప్రాణత్యాగం చేయడం అప్పట్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. గత ఏడాది ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు జరిపిన దాడిలో 26 మంది అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించింది. దీనికి ప్రతీకారంగా భారత్ మే 7న ‘ఆపరేషన్ సిందూర్’ పేరుతో పాకిస్తాన్‌తో పాటు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై వైమానిక, సైనిక దాడులు నిర్వహించింది. ఉగ్రవాద మౌలిక సదుపాయాలనే లక్ష్యంగా చేసుకుని భారత సాయుధ దళాలు ఈ ఆపరేషన్‌ను అత్యంత వ్యూహాత్మకంగా అమలు చేశాయి.

**ఇప్పుడు అధికారికంగాడ**

ఇప్పటి వరకు ‘ఆపరేషన్ సిందూర్’లో వీరమరణం పొందిన జవాన్ల వివరాలను అధికారికంగా ప్రకటించలేదు. తాజాగా నేషనల్ వార్ మెమోరియల్ వెబ్‌సైట్‌లో వారి పేర్లను ‘రోల్ ఆఫ్ ఆనర్-2025’లో చేర్చడంతో ఈ ఆరుగురు అమరవీరుల త్యాగానికి దేశం అధికారిక గుర్తింపు ఇచ్చినట్లైంది. త్వరలో జాతీయ యుద్ధ స్మారకంలోని శిలాఫలకాలపై వారి పేర్లు శాశ్వతంగా చెక్కనుండటంతో భారత సైనిక చరిత్రలో వారి సేవలు చిరస్థాయిగా నిలిచిపోనున్నాయి. దేశ భద్రత కోసం ప్రాణత్యాగం చేసిన ఈ వీరజవాన్లకు యావత్ దేశం మరోసారి ఘనంగా నివాళులర్పిస్తోంది.

# దామెరలో కులమతాలకు అతీతంగా మొహరం (పీరీల) వేడుకలు

## హిందూముస్లిం సౌభ్రాతృత్వానికి ప్రతీకగా ఉత్సవాలు



**ఎల్కతుర్తి,/ జూన్ 26 (జర్నలిస్ట్ వార్త):**
ఎల్కతుర్తి మండలంలోని దామెర గ్రామంలో మొహరం (పీరీల) వేడుకలు కులమతాలకు అతీతంగా ఘనంగా నిర్వహించేందుకు గ్రామస్థులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏళ్ల తరబడి కొనసాగుతున్న సంప్రదాయాన్ని కొనసాగిస్తూ హిందూ, ముస్లిం సోదరులు కలిసి పీరీల ఉత్సవాల్లో పాల్గొనడం గ్రామంలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.గ్రామానికి చెందిన గూడెపు ప్రభాకర్ ప్రతి ఏడాది సంప్రదాయం ప్రకారం ప్రత్యేక వేషధారణలో పాల్గొంటున్నారు. చాకలి వర్గానికి చెందిన ఆయన గౌడ సంఘానికి సంబంధించిన వేషధారణ వేయడం గ్రామంలో ఆనవాయితీగా కొనసాగుతోందని తెలిపారు. ఈ సంప్రదాయాన్ని పాటించడం వల్ల తమ కుటుంబానికి శుభాలు కలుగుతాయని, కోరుకున్న కోరికలు నెరవేరుతాయని విశ్వసిస్తున్నట్లు చెప్పారు.మొహరం సందర్భంగా ఒడ్డెర, చాకలి, మంగలి తదితర వృత్తి ఆధారిత వర్గాలకు చెందిన వారు తమ సంప్రదాయ వేషధారణలో పాల్గొనడం తరతరాలుగా వస్తోందని గ్రామ పెద్దలు తెలిపారు. ఈ ఆచారాలు గ్రామంలో సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.మొహరం పండుగను కేవలం ముస్లింల పండుగగా కాకుండా, హిందూముస్లింల ఐక్యతకు నిదర్శనంగా దామెర గ్రామ ప్రజలు సంయుక్తంగా జరుపుకోవడం విశేషంగా నిలుస్తోంది. గ్రామంలో నెలకొన్న సామరస్య వాతావరణం, పరస్పర గౌరవ భావన ఈ వేడుకలకు మరింత ప్రత్యేకతను తీసుకొస్తోందని గ్రామస్థులు తెలిపారు.

# మాదకద్రవ్యాలకు సమాజంలో చోటులేదు

## గంజాయి రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

## డ్రగ్స్‌పై సమాచారం ఉంటే 1908కు తెలియజేయండి: కలెక్టర్, పోలీస్ కమిషనర్






**ఖమ్మం,/ జూన్ 26 (జర్నలిస్ట్ వార్త):**
మాదకద్రవ్యాలను సమాజానికి దూరం చేయడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ పేర్కొన్నారు. డ్రగ్స్, గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం వ్యక్తితో పాటు కుటుంబం, సమాజాన్నీ నాశనం చేస్తుందని హెచ్చరించారు. ప్రజల సహకారంతో గంజాయి రహిత సమాజ నిర్మాణమే లక్ష్యమని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ స్పష్టం చేశారు.అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఖమ్మం నగరంలోని మమత రోడ్డులోని వివిసి టాటా సర్వీస్ సెంటర్ నుంచి లకారం ట్యాంక్‌బండ్ వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీని కలెక్టర్ దివాకర్ టీఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య ప్రారంభించారు. ర్యాలీలో విద్యార్థులు, యువత, పోలీసులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ నిర్మాణంలో యువత కీలక శక్తి అని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలు వ్యాధి కంటే ప్రమాదకరమైనవని, వాటి బారిన పడితే జీవితమే కాకుండా కుటుంబ భవిష్యత్తు కూడా ప్రమాదంలో పడుతుందని అన్నారు. డ్రగ్స్ నియంత్రణలో ప్రజల సహకారం ఎంతో కీలకమని, చట్టవిరుద్ధ కార్యకలాపాలు ఎక్కడైనా కనిపిస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని పిలుపునిచ్చారు.పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీస్ శాఖ నిరంతరం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. విద్యాసంస్థలు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల విక్రయం, వినియోగంపై సమాచారం ఉంటే వెంటనే 1908కు ఫోన్ చేసి తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు.
అనంతరం అధికారులు, విద్యార్థులు, యువతతో కలిసి డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంపై ప్రతిజ్ఞ చేశారు. “ఐ యామ్ యాంటీ డ్రగ్ సోల్జర్స్“ సెల్ఫీ పాయింట్ వద్ద ఫొటోలు దిగడంతో పాటు సంతకాల కార్యక్రమంలో పాల్గొని మాదకద్రవ్యాల నిర్మూలనకు తమ మద్దతు ప్రకటించారు.ఈ కార్యక్రమంలో ఏసీపీ రమణమూర్తి, ఎస్బీ ఏసీపీ మహేష్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

# తవ్వి వదిలేసిన రహదారి..

## బురదమయంగా మారిన ప్రధాన మార్గం

### విద్యార్థులు, భక్తులు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు



**మధిర,/ జూన్ 26 (జర్నలిస్ట్ వార్త):**అండర్ డ్రైనేజీ పనుల కోసం తవ్విన రహదారిని మరమ్మతు చేయకుండా వదిలేయడంతో మధిర పట్టణంలోని సుజల వాటర్ ప్లాంట్ నుంచి నారాయణ స్కూల్ వరకు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు తవ్విన ప్రాంతమంతా బురదమయంగా మారి చిన్న చెరువును తలపిస్తోంది. దీంతో నిత్యం ఈ మార్గంలో ప్రయాణించే విద్యార్థులు, భక్తులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.అండర్ డ్రైనేజీ పనులు పూర్తి చేసిన అనంతరం రహదారిని పునరుద్ధరించాల్సిన మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్డంతా బురదతో నిండిపోవడంతో ద్విచక్ర వాహనాలు జారిపడుతున్నాయి. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వారిని తీసుకెళ్లే తల్లిదండ్రులు నిత్యం ప్రమాద భయంతో ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఇదే మార్గం గుండా స్థానిక దేవాలయాలకు వెళ్లే భక్తులు, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు కూడా తీవ్ర అవస్థలు పడుతున్నారు. సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ సంబంధిత వార్డు ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
రోడ్డుపై పేరుకుపోయిన బురదను వెంటనే తొలగించి, తాత్కాలికంగానైనా రాకపోకలకు ఇబ్బందులు లేకుండా మరమ్మతులు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. శాశ్వత పరిష్కారంగా రహదారిని పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని, ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ సమస్యపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# ఆగస్టు నాటికి కల్లూరుగూడెం పామాయిల్ ఫ్యాక్టరీ సిద్ధం చేయాలి

## నిర్మాణ పనులు పరిశీలించిన మంత్రి తుమ్మల.. వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం







**కల్లూరు,/జూన్ 26 (జర్నలిస్ట్ వార్త):**
ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గంలోని వేంసూరు మండలం కల్లూరుగూడెంలో నిర్మాణంలో ఉన్న పామాయిల్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ పనులను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయితో కలిసి పనుల పురోగతిని సమీక్షించిన మంత్రి, ఆగస్టు నెల నాటికి ఫ్యాక్టరీని రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చేలా నిర్మాణాన్ని వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణలో పామాయిల్ సాగు రైతాంగానికి వరంగా మారిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం పామాయిల్ సాగు విస్తరణలో దేశంలోనే తొలి స్థానంలో నిలిచిందని తెలిపారు. దేశవ్యాప్తంగా సుమారు 15 లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు జరుగుతుండగా, వంటనూనెల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలంటే దానిని 70 లక్షల ఎకరాలకు విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు.వంటనూనెల దిగుమతులపై దేశం ప్రతి ఏడాది భారీగా విదేశీ మారకద్రవ్యాన్ని వెచ్చిస్తున్నందున, పామాయిల్ దిగుమతులపై కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని పెంచాలని ఇటీవల కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, ప్రహ్లాద్ జోషిలను కలిసి రాష్ట్ర ప్రభుత్వం తరఫున విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం పామాయిల్ ఫ్రూట్ బంచ్ టన్ను ధర రూ.23,852 ఉండగా, కనీస గ్యారంటీ ధరను రూ.25 వేలుగా ప్రకటించాలని కూడా కోరినట్లు వెల్లడించారు.రాష్ట్రంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రెండు పామాయిల్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలు ఇప్పటికే అందుబాటులో ఉండగా, ఖమ్మం జిల్లా కల్లూరుగూడెం, కొనిజర్లతో పాటు గద్వాల, ములుగు, పెద్దపల్లి, వనపర్తి జిల్లాల్లో కొత్త ఫ్యాక్టరీల నిర్మాణం కొనసాగుతోందన్నారు. వీటిని త్వరితగతిన పూర్తి చేస్తే రైతులకు రవాణా వ్యయాలు తగ్గి, పంటకు మెరుగైన మార్కెట్ లభిస్తుందని పేర్కొన్నారు.రైతు భరోసా, రైతు బీమా, ఉచిత విద్యుత్ వంటి ప్రభుత్వ పథకాలతో పామాయిల్ రైతులకు అండగా నిలుస్తున్నామని, ప్రత్యామ్నాయ పంటల సాగులో భాగంగా రైతులు పామాయిల్ సాగుపై దృష్టి సారించాలని మంత్రి తుమ్మల పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్, ఉద్యానశాఖ అధికారులు పాల్గొన్నారు.

# తల్లాడలో పారిశుద్ధ్యం గాలికి..

## చెత్తకుప్పల మధ్య ప్రజల జీవనం

### మూసుకుపోయిన డ్రైనేజీలు.. దోమల బెడదతో అంటువ్యాధుల భయం







**తల్లాడ, /జూన్ 26 (జర్నలిస్ట్ వార్త):**
తల్లాడ మండలంలోని గ్రామాల్లో పారిశుద్ధ్య వ్యవస్థ అధ్వానంగా మారింది. ఏ గ్రామానికి వెళ్లినా చెత్తాచెదారం, మూసుకుపోయిన డ్రైనేజీలు, నిల్వ నీటితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీల్లో కలుపు మొక్కలు పెరిగిపోవడంతో మురుగునీరు సరిగా ప్రవహించక దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో దోమలు విజృంభించి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రజల నుంచి పన్నులు వసూలు చేయడంలో చురుకుగా వ్యవహరించే గ్రామ పంచాయతీలు, పారిశుద్ధ్య నిర్వహణలో మాత్రం నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో వారాల తరబడి డ్రైనేజీలను శుభ్రం చేయకపోవడంతో మురుగు నీరు రోడ్లపైకి చేరి ప్రజల రాకపోకలకు కూడా ఇబ్బందిగా మారింది.తక్షణ చర్యలు తీసుకోవాలిడ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, కలుపు మొక్కలను వెంటనే తొలగించి మురుగునీటి ప్రవాహాన్ని పునరుద్ధరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. దోమల నివారణకు ప్రత్యేక ఫాగింగ్ నిర్వహించడంతో పాటు గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని కోరుతున్నారు.ప్రజల ఆరోగ్యాన్ని గాలికొదిలేసి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించబోమని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని కోరుతున్నారు.

# వానల కోసం గ్రామదేవతలకు జలాభిషేకం

## సూరారంలో మహిళల ప్రత్యేక పూజలు.. వానదేవుడికి వేడుకలు



**ఎల్కతుర్తి, /జూన్ 26 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని సూరారం గ్రామంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ గ్రామ మహిళలు, గ్రామస్థులు గ్రామదేవతలకు శుక్రవారం ప్రత్యేక జలాభిషేకం నిర్వహించారు. బిందెలతో నీరు తీసుకువచ్చి గ్రామదేవతలకు అభిషేకాలు చేస్తూ, వానదేవుడిని ప్రార్థించారు.ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. సకాలంలో వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండాలని, రైతులు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. సమస్త ప్రజలు, పశుసంపద, పిల్లాపాపలు ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో జీవించాలని గ్రామదేవతలను వేడుకున్నారు. గ్రామంలో వర్షాభావ పరిస్థితులు తొలగి పచ్చని పంటలతో పొలాలు కళకళలాడాలని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు.
కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పిట్టల మహేందర్, మాజీ సర్పంచ్ సాంబమూర్తి గౌడ్, ఎర్రబెల్లి సంపత్‌రావు, రాములు, గుండేటి సతీశ్‌తో పాటు గ్రామ మహిళలు, ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక



# క్రికెట్ టోర్నీకి రంగం సిద్ధం.. జట్ల ఎంపిక పూర్తి



**భీమదేవరపల్లి/జూన్26 (జర్నలిస్ట్ వార్త):**
భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామంలో నిర్వహించనున్న క్రికెట్ టోర్నమెంట్‌కు సంబంధించిన జట్ల ఎంపిక ప్రక్రియను శుక్రవారం ముత్తారం గ్రామంలో గ్రామ ఇన్‌చార్జి సర్పంచ్ మాట్ల హరికుమార్ చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించారు. గ్రామ యువత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్‌కు మంచి స్పందన లభించిందని నిర్వాహకుడు రేణికుంట్ల విద్యాసాగర్ తెలిపారు. ఈ సందర్భంగా మొత్తం ఎనిమిది జట్లు ఎంపిక చేయగా, సుప్రీం, వెంకటేష్, అవినాష్, ప్రశాంత్, మహేందర్, విద్యాధర్, భరత్, శ్రీకాంత్‌లు తమ తమ జట్లకు కెప్టెన్లుగా వ్యవహరించనున్నారు. టోర్నమెంట్‌ను క్రీడాస్ఫూర్తితో నిర్వహించడంతో పాటు గ్రామ యువతలో ఐక్యత, స్నేహభావం పెంపొందించడమే ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు పేర్కొన్నారు. నేడు ప్రారంభమయ్యే తొలి దశ మ్యాచ్‌లలో శ్రీకాంత్ జట్టుమహేందర్ జట్టు, వెంకటేష్ జట్టుప్రశాంత్ జట్టు, భరత్ జట్టువిద్యాధర్ జట్టు, అవినాష్ జట్టుసుప్రీం జట్టు పరస్పరం తలపడనున్నాయి. అన్ని మ్యాచ్‌లు ఉత్కంఠభరితంగా సాగనున్నాయని, విజేత జట్లు తదుపరి దశకు అర్హత సాధిస్తాయని నిర్వాహకుడు విద్యాసాగర్ తెలిపారు. టోర్నమెంట్‌ను విజయవంతం చేసేందుకు గ్రామ ప్రజలు, యువత, క్రీడాభిమానులు అధిక సంఖ్యలో హాజరై క్రీడాకారులను ప్రోత్సహించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, యువకులు, క్రీడాకారులు పాల్గొని టోర్నమెంట్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

# మృతుని కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే.




**బయ్యారం/,జూన్ 26.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండలం గంధంపల్లి కొత్తపేట పంచాయతీకి చెందిన నీలం సాయి చనిపోయిన విషయాన్ని తెలుసుకొన్న ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య మృతుని భౌతిక దేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. ఈ నేపథ్యంలో మృతుని కుటుంబ సభ్యులకు ధైర్యంగా ఉండాలని సూచించారు. మృతుడి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. ఎమ్మెల్యే వెంట కొత్తపేట సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్,వార్డు సభ్యులు బొమ్మ కంటి రాంబాబు,భూక్య శీను,సంతోష్ తదితరులు ఉన్నారు.

# బయ్యారం పెద్ద చెరువును సందర్శించిన జిల్లా కిసాన్ సెల్ ప్రధాన కార్యదర్శి.



**బయ్యారం/,జూన్ 26.(జర్నలిస్ట్ వార్త)**బయ్యారం పెద్ద చెరువుని మహబూబాబాద్ జిల్లా కిసాన్ సెల్ ప్రధాన కార్యదర్శి పెద్దినేని వెంకటేశ్వరరావు సందర్శించారు. చెరువులో నీటి నిలవలు ప్రస్తుతం ఎల్నీనో ప్రభావం వల్ల వర్షపాతం తక్కువగా ఉంటుందని ప్రభుత్వం చెబుతున్న క్రమంలో రైతులు ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పప్పు దాన్యలు,కూరగాయల సాగు,మెట్ట పంటలు సాగు వైపు మొగ్గుచూపాలని తొందరపడి వ్యవసాయ ఖర్చులు పెట్టి నష్టపోవద్దని,ఎరువులు, పురుగుమందులు ముందే కొని నష్టపోవద్దని అన్నారు.అదే విధంగా బయ్యారం పెద్ద చెరువు కాలువలు అధ్వానంగా ఉన్నాయని,అధికారులు తూములు మరమ్మతులు చేపించాలని లేనియెడల రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుని కలిసి బయ్యారం పెద్ద చెరువు అభివృద్ధి కోసం బడ్జెట్ కేటాయించాలని వినతి పత్రం అందజేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ టీపీసీసీ రాష్ట్ర నాయకులు గుగులోత్ కిషన్ నాయక్,కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు నాయిని శ్రీనివాస్ రెడ్డి,తాటి జనార్ధన్, నందగిరి భద్రయ్య,బీరెడ్డి శ్రీనివాస్,తుపాకుల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# వివాహ వేడుకకు హాజరైన ఎమ్మెల్యే కోరం కనకయ్య.



**బయ్యారం/,జూన్ 26.(జర్నలిస్ట్ వార్త)**బయ్యారం మండలం కస్తూరినగరం గ్రామానికి చెందిన టీచర్ మాలోత్ నరేష్,సౌందర్య వివాహ వేడుకకు ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ సందర్భంగా వధూవరులకు వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు భూక్య ప్రవీణ్ నాయక్,రవి నాయక్,మోహన్ జీ,తెల్లం బిక్షం,ఉప సర్పంచ్ తొట్టి కృష్ణ,రాసమళ్ళ నాగేశ్వరరావు,గుగులోత్ మంగీలాల్,కోరం సురేష్,నాగరాజు,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# యువత మత్తుకు దూరంగా ఉండాలి.. డ్రగ్స్‌పై సమాజమంతా పోరాడాలి

## ప్రపంచ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్

**ఎల్కతుర్తి, /జూన్ 26 (జర్నలిస్ట్ వార్త):**
ప్రపంచ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎల్కతుర్తి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచనల మేరకు మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ర్యాలీలో “డ్రగ్స్‌కు నో చెప్పండి.. జీవితానికి అవును చెప్పండి“ అనే



నినాదాలతో ప్రజల్లో అవగాహన కల్పించారు.మత్తు పదార్థాల వినియోగం వల్ల వ్యక్తిగత ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా కుటుంబాలు విచ్ఛిన్నమవుతాయని, యువత భవిష్యత్తు అంధకారంలోకి వెళ్లే ప్రమాదం ఉందని శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. మద్యపానం, మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ మంచి విద్యను అభ్యసించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని విద్యార్థులకు సూచించారు.అలాగే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవిస్తూ బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని యువతకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షులు, వార్డు సభ్యులు, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎలుకుర్తి, రామన్నగూడెంలో బెల్ట్ షాపులకు బంద్

## నేటి నుంచి మద్యం విక్రయాలకు చెక్ -సర్పంచ్ నరిశెట్టి సుధాకర్ పిలుపు.. గ్రామస్థుల హర్షం







**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో, జూన్ 26 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని ఎలుకుర్తి, రామన్నగూడెం గ్రామాల్లో బెల్ట్ షాపుల ద్వారా జరుగుతున్న మద్యం విక్రయాలకు శుక్రవారం నుంచి పూర్తిగా చెక్ పడింది. గ్రామాభివృద్ధి, కుటుంబాల సంక్షేమం, యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని గ్రామస్థులు ఏకగ్రీవంగా బెల్ట్ షాపులను మూసివేయాలని నిర్ణయించారు. మహిళా సంఘాలు, యువజన సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సీనియర్ సిటిజన్లు ఈ నిర్ణయానికి సంఘీభావం ప్రకటించగా, బెల్ట్ షాపుల నిర్వాహకులు కూడా స్వచ్ఛందంగా మద్యం విక్రయాలనునిలిపివేయడానికి అంగీకరించారు.ఈ సందర్భంగా ఎలుకుర్తి సర్పంచ్ నరిశెట్టి సుధాకర్ మాట్లాడుతూ, గ్రామాన్ని మద్యరహితంగా తీర్చిదిద్దేందుకు ప్రజలంతా సహకరించాలని కోరారు. మహిళల విజ్ఞప్తి, గ్రామ ప్రజల ఆకాంక్ష మేరకే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఇకపై గ్రామంలో ఎక్కడా రహస్యంగా మద్యం విక్రయాలు జరగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. బెల్ట్ షాపుల నిర్వాహకులు స్వచ్ఛందంగా సహకరించడం అభినందనీయమని పేర్కొన్నారు.బెల్ట్ షాపుల మూసివేతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు శుక్రవారం గ్రామ పాఠశాల నుంచి భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు మహిళా సంఘాలు, యువజన సంఘాలు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సీనియర్ సిటిజన్లు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.గ్రామస్థులంతా ఏకమై బెల్ట్ షాపుల మూసివేతకు మద్దతు పలకడంతో గ్రామంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. గ్రామ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని తీసుకున్న ఈ నిర్ణయం ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు.

# చిన్నారి సాత్వికను ఆశీర్వదించిన ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు



**వర్ధన్నపేట/జూన్ 26(జర్నలిస్ట్ వార్త):**
కట్ర్యాల: వర్ధన్నపేట మండలం కట్ర్యాల గ్రామంలో బండారి మౌనిక, సంపత్ దంపతుల కుమార్తె చి. సాత్విక నూతన వస్త్రాలంకరణ (పుష్పాలంకరణ) వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు ముఖ్య అతిథిగా హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. అనంతరం కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యం, మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, జిల్లా సీనియర్ నాయకులు పోషాల వెంకన్న గౌడ్ పాల్గొన్నారు. వారితో పాటు మహిళా మండల అధ్యక్షురాలు మరుపట్ల అరుణ, గ్రామ పార్టీ అధ్యక్షుడు బండారి సతీష్ గౌడ్, ఎస్సీ విభాగం నాయకుడు మరుపట్ల సాయికుమార్, యూత్ నాయకులు మునిగాల సృజన్, మునిగాల మల్లేశం తదితరులు హాజరై చిన్నారికి శుభాశీస్సులు అందించారు.

# ప్రతి “ఫ్రైడే-డ్రైడే” కార్యక్రమం తప్పనిసరి..

## అధికారులకు ఆదేశాలు జారీచేసిన పవన్

**అమరావతి,జూన్ 26 (జర్నలిస్ట్ వార్త):**
రాష్ట్రవ్యాప్తంగా ప్రతి శుక్రవారం “ఫ్రైడే-డ్రైడే” కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులను ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మురుగు కాలువల శుద్ధి, సీజనల్ వ్యాధుల నివారణ చర్యలపై నిర్వహించిన సమీక్షలో ఆయన కీలక సూచనలు చేశారు. క్షేత్రస్థాయిలో మురుగు నీటి నిల్వలను తొలగించి, తాగునీటి పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణ, దోమల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. ప్రజారోగ్య పరిరక్షణే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంటూ, అన్ని గ్రామ పంచాయతీల్లో బ్లీచింగ్ పౌడర్, క్లోరిన్ బిళ్లలు తగిన మోతాదులో ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# ‘సర్’.. మొదలైంది..

**బయ్యారం/,జూన్ 26.(జర్నలిస్ట్ వార్త)**



భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమంలో భాగంగా బయ్యారం, చింతోని గుంపు,జగత్రావుపేట గ్రామాల్లో జరుగుతున్న హౌస్ టు హౌస్ ఎన్యుమరేషన్ ప్రక్రియను బయ్యారం మండల తహసీల్దార్ నాగరాజు పరిశీలించారు.ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా ఎన్యుమరేషన్ ఫారాలు,అవగాహన కరపత్రాలు ప్రతి ఇంటికి సక్రమంగా పంపిణీ అవుతున్నాయా..ఫారం నింపే విధానంపై ఓటర్లకు సరైన అవగాహన కల్పిస్తున్నారా..అనే అంశాలను పరిశీలించారు.ఎన్యుమరేషన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని తహసీల్దార్ సూచించారు. ప్రతి బీఎల్ఓ రోజువారీ లక్ష్యాలతో హౌస్ టు హౌస్ సర్వే సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సూచనలు అధికారులకు అందించారు.ప్రతి ఓటరు వివరాలు ఖచ్చితంగా నమోదయ్యేలా ప్రజలు సహకరించాలని తహసీల్దార్ నాగరాజు కోరారు.ఈ కార్యక్రమంలో బిఎల్ఓలు,సూపర్వైజర్లు,ప్రజాప్రతినిధులు,ఓటర్లు తదితరులు పాల్గొన్నారు.

# కొత్తపేట రైతు వేదికలో విత్తన మేళాను సందర్శించిన జిల్లా వ్యవసాయ అధికారి.



**బయ్యారం/,జూన్ 26.(జర్నలిస్ట్ వార్త)**బయ్యారం మండలం, కొత్తపేట రైతు వేదికలో నిర్వహించిన విత్తన మేళాను జిల్లా వ్యవసాయ అధికారి విజయ చంద్ర సందర్శించారు.ఈ సందర్భంగా రైతులకు విత్తనాలు,యూరియా ఎరువులను పంపిణీ చేశారు.అనంతరం రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన వరి ప్రాధాన్య రకాలను సాగు చేయాలని,యూరియా వినియోగాన్ని తగ్గించి సమతుల్య ఎరువుల వినియోగానికి ప్రాధాన్యత ఇవ్వాలని, నానో యూరియా వినియోగాన్ని ప్రోత్సహించాలని,పంటల వైవిధ్యీకరణను అవలంబించాలని, ఎల్ నీనో ప్రభావం నేపథ్యంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు సూచించారు.అనంతరం మండలానికి తొలిసారిగా విచ్చేసిన జిల్లా వ్యవసాయ అధికారిని రైతులు, విత్తనాల విక్రేతలు,వ్యవసాయ శాఖ అధికారులు,సిబ్బంది ఘనంగా శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కే.రాజు,వ్యవసాయ విస్తరణ అధికారులు,విత్తనాల విక్రేతలు,శాఖ సిబ్బంది,అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# సనత్‌నగర్ కల్ట్ జిమ్ కేసులో కొత్తకోణం

## జిమ్‌కు వచ్చే మహిళలపై కోచ్ లైంగిక వేధింపులు -కేసు నమోదు చేసిన పోలీసులు

**హైదరాబాద్,జూన్ 26 (జర్నలిస్ట్ వార్త):** నగరంలోని సనత్ నగర్ కల్ట్ జిమ్ వేధింపుల ఉదంతంలో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. గతంలో ఒక పైలట్‌ను వేధించిన కేసులో ఆరోపణలు ఎదుర్కొన్న ఓ మహిళ.. ఇప్పుడు అదే జిమ్‌లో తనను కొందరు తీవ్రంగా వేధిస్తున్నారంటూ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం మరో మలుపు తిరిగింది. జిమ్‌లో పరిచయమైన శ్రుతిక అనే మహిళ తనను అసభ్య కార్యకలాపాల్లో పాల్గొనాలని కోరినట్లు బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది. తాను, తన ప్రియుడు నరేష్ నాయుడుతో పాటూ జిమ్ ట్రైనర్లుగా పనిచేస్తున్న చెడిమాల హరీష్, గోపికృష్ణలు గ్రూప్‌గా అసభ్య కార్యాకలాపాల్లో పాల్గొంటామని శ్రుతిక బాధితురాలికి చెప్పింది. ఈ గ్రూప్‌లో చేరడానికి ఆసక్తి




ఉందా అంటూ ఆమె అడగడంతో బాధితురాలు తీవ్ర దిగ్భ్రాం÷-రతికి గురై, వెంటనే అక్కడి నుంచి వెళ్ళిపోయింది. శ్రుతిక బ్యాచ్‌తో కలవడానికి నిరాకరించడంతో.. ఆ తర్వాత లిఫ్ట్‌లో శ్రుతిక, నరేష్ నాయుడు కలిసి బాధితురాలిని అసభ్య పదజాలంతో దూషించారు. ఆ సమయంలో నరేష్ నాయుడు బాధితురాలి పట్ల అత్యంత అసభ్యంగా ప్రవర్తించి, లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఎఫ్‌ఐఆర్ లో నమోదైంది. ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే తీవ్ర పరిణామాలు ఉంటాయని వారు బాధితురాలిని బెదిరించారు. ఈ ఘటన జరిగిన మూడు రోజుల తర్వాత.. జిమ్ బేస్‌మెంట్‌లో ట్రైనర్లు హరీష్, గోపీకృష్ణలు కూడా బాధితురాలిని వేధించినట్లు పోలీసులు గుర్తించారు. వారిలో ఒకరు బాధితురాలి పట్ల అసభ్యంగా ప్రవర్తించగా.. మరొకరు జుట్టు లాగి హింసించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితులపై సనత్ నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తు బాధ్యతలను ఉన్నతాధికారులు ఎస్ఐ అనూషకు అప్పగించారు.

# అప్పు అడిగినందుకే హత్యలు

## నల్లగొండ నలుగురి హత్యకేసులో మిడిన మిస్టరీ

**నల్గొండ,జూన్ 26 (జర్నలిస్ట్ వార్త):** నల్గొండలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురి దారుణ హత్య కేసును పోలీసులు ఛేదించారు. దంపతులతో పాటు ఇద్దరు పిల్లలను చంపింది ఒక్కడేనని నిర్ధారించారు. ఇటీవల నల్గొండ తెలంగాణ కాలనీలోని ఇంట్లో భార్యాభర్తలు మహ్మద్ సుల్తాన్ (45), హసీనా (38)తో పాటు వారి కుమారుడు ముజామిల్ (20), కుమార్తె అఫోర (14) హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈనెల 20న తెల్లవారుజామున హత్యలు జరగ్గా.. 22న ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ప్రధాన నిందితుడు సయ్యద్ అస్లాం, అతడి భార్య తబస్సుమ్‌తో పాటు వారికి పరోక్షంగా సహకరించిన సోహైల్, హేమంత్‌కుమార్‌ను అరెస్ట్ చేశారు. ఈ కేసు వివరాలను జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మీడియాకు వెల్లడించారు.




ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్థిక లావాదేవీల కారణంగానే అస్లాం ఘాతుకానికి పాల్పడ్డాడు. అక్క కుమార్తె తబస్సుమ్, అస్లాంకు హసీనా ఏడాది క్రితం రూ.లక్ష అప్పు ఇచ్చారు. ఇటీవల మరో రూ.లక్ష కావాలని సుల్తాన్, హసీనా దంపతులను అస్లాం అడిగాడు. దానికి హసీనా నిరాకరించారు. గతంలో ఇచ్చిన డబ్బు తిరిగివ్వాలని కోరారు. డబ్బు కోసం ఒత్తిడి చేశారని తబస్సుమ్, అస్లాం వారిపై పగ పెంచుకున్నారు.అస్లాం యూట్యూబ్‌లో చూసి హత్యలకు పథకం పన్నాడు. ఈనెల 20 తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు వచ్చిన హసీనాను తొలుత చంపాడు. ఆ తర్వాత అరుపుల శబ్దం విని బయటకు వచ్చిన సుల్తాన్, ముజామిల్‌ను కూడా అంతమొందించాడు. ఇంట్లో ఉన్న అఫోరను కూడా వదల్లేదు. ఇంట్లోకి వెళ్లి మరీ మంచం కింద దాక్కున్న అఫోరను కడతేర్చాడు. ఈ హత్యల తర్వాత ఇంట్లోని నగదు, బంగారు ఆభరణాలను అస్లాం దోచుకెళ్లాడని ఎస్పీ వివరించారు.

# సమిష్టిగా ఏఐ పునాదులను పటిష్టం చేద్దాం

## భారత్-యూఎస్ రౌండ్‌టేబుల్ సమావేశంలో నిర్ణయం


**న్యూఢిల్లీ,జూన్ 26 (జర్నలిస్ట్ వార్త):** : భారత్, అమెరికా సంబంధాలలో కీలక పరిణామం జరిగింది. ఇరు దేశాల వ్యూహాత్మక సాంకేతిక భాగస్వామ్యాన్ని మరింత పటిష్టం చేసుకునే ప్రయత్నంలో భాగంగా భారత్, అమెరికాలు ఒక రహస్య రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించాయి. ఈ మీటింగ్‌లో ఇరు దేశాల సీనియర్ ప్రభుత్వ అధికారులు, పారిశ్రామిక నాయకులు పాల్గొని ఏఐ, సెమీకండక్టర్ సరఫరా గొలుసులు, కీలక ఖనిజాల రంగాలలో సహకారాన్ని బలోపేతం చేయడంపై చర్చించారు. ఈ సమావేశంలో కలిసికట్టుగా ఏఐ పునాదులను పటిష్టం చేద్దామని ఇరు దేశాలు నిర్ణయించాయి. ఈ మీటింగ్ ప్రాధాన్యాన్ని తెలియజేస్తూ అమెరికాలోని భారత రాయబార కార్యాలయం శుక్రవారం ఎక్స్‌లో పోస్ట్ పెట్టింది. "చిప్స్, కీలక ఖనిజాలు, ఏఐ రంగాలలో పనిచేస్తున్న భారతీయ, అమెరికన్ కంపెనీల బృందాన్ని ఉద్దేశించి అమెరికాలో భారత రాయబారి వినయ్ క్వాత్రా, ఐటీ కార్యదర్శి ఎస్. కృష్ణన్, వాణిజ్య శాఖ డిప్యూటీ అండర్ సెక్రటరీ బిల్ గైడెరా ప్రసంగించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశాన్ని యూఎస్‌లోని ఇండియన్ ఎంబసీ యూఎస్ఐఎస్‌పీఎఫ్, సిల్వరాడో పాలసీ యాక్సిలరేటర్ (పరిశోధనా సంస్థ)తో కలిసి నిర్వహించింది. ఈ మీటింగ్‌లో జరిగిన చర్చలలో విదేశాంగ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి నాగరాజ్ నాయుడు, యూఎస్ఐఎస్‌పీఎఫ్ అధ్యక్షుడు ముకేశ్? అఘి, ఇంధన శాఖ డిప్యూటీ అసిస్టెంట్ సెక్రటరీ క్రిస్టోఫర్ సల్దానా కూడా పాల్గొన్నారు. పెట్టుబడి వాతావరణాన్ని బలోపేతం చేయడం, ఏఐ రంగంలో ద్వైపాక్షిక సహకారాన్ని విస్తరించడంపై ఈ రౌండ్ టేబుల్ సమావేశం దృష్టి సారించింది" అని అమెరికాలోని ఇండియన్ ఎంబసీ ఎక్స్ పోస్టులో పేర్కొంది. కొద్ది రోజుల క్రితం అమెరికాలోని భారత రాయబారి వినయ్ మోహన్ క్వాత్రా పెట్టుబడి విస్తరణ, సరఫరా గొలుసు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల గురించి చర్చించడానికి అగ్రశ్రేణి కార్పొరేట్, టెక్నాలజీ నాయకులతో పలు ఉన్నత స్థాయి సమావేశాలు నిర్వహించారు. అమెరికాతో దిల్లీకి పెరుగుతున్న ఆర్థిక, సాంకేతిక భాగస్వామ్యాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. భారత మార్కెట్లో తమ ఉనికిని మరింత విస్తరించుకోవడంపై చర్చించడానికి రిటైల్ దిగ్గజం వాల్‌మార్ట్ ప్రెసిడెంట్, సీఈఓ క్రిస్ నికోలస్‌తో సమావేశమయ్యారు. "దేశంలో వాల్‌మార్ట్ పెట్టుబడులు, దీర్ఘకాలిక వృద్ధి ప్రణాళికలు, పటిష్టమైన సరఫరా గొలుసులను నిర్మించాలనే నిబద్ధతపై ఆ కంపెనీ ప్రెసిడెంట్, సీఈఓ క్రిస్ నికోలస్‌తో ఫలప్రదమైన చర్చలు జరిపా " అని వినయ్ క్వాత్రా పేర్కొన్నారు. సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మిని అహ్వానం మేరకు ప్రధాని నరేంద్ర మోదీ ఆ దేశంలో జూన్ 27-29 వరకు పర్యటించనున్నారు. జూన్ 29న జరిగే సీషెల్స్ జాతీయ దినోత్సవ వేడుకల్లో గౌరవ అతిథిగా పాల్గొననున్నారు. అలాగే సెషెల్స్ జాతీయ అసెంబ్లీని ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ప్రవాస భారతీయులతో కూడా సమావేశమవుతారు. అయితే మోదీ పర్యటన నేపథ్యంలో విక్టోరియా-మహే ప్రాంతమంతటా ప్రవాస భారతీయులు ఆయనకు స్వాగతం పలుకుతూ పోస్టర్లను ఏర్పాటు చేశారు.

# అంబారీపై బీబీ-కా-ఆలం ఊరేగింపు

**మొహరం సందర్భంగా చార్మినార్ వద్దకు**

**భారీగా తరలివచ్చిన జనం**

**హైదరాబాద్:జూన్ 26 (జర్నలిస్ట్ వార్త):**
హైదరాబాద్ పాతబస్తీలో చారిత్రక 'బీబీ-కా-ఆలం' మొహరం ఊరేగింపు శుక్రవారం మధ్యాహ్నం భక్తి శ్రద్ధలతో ప్రారంభమైంది. ఈ వేడుకల కోసం ప్రత్యేకంగా కేరళ నుంచి ప్రత్యేకంగా తీసుకు వచ్చిన 'శ్రీదేవి' అనే ఏనుగుపై బీబీ కా ఆలం ను ఊరేగించారు. ఈ వార్షిక కార్యక్రమంలో పాల్గొనేందుకు వేలాది మంది ప్రజలు తరలివచ్చారు. దబీర్‌పురాలో మొదలైన ఈ ఊరేగింపు చార్మినార్, గుల్జార్ హౌస్ మీదుగా సాగి చాదర్‌ఘాట్ వద్ద ముగిసింది. ఈ కార్యక్రమం సందర్భంగా భద్రతను పర్యవేక్షించడానికి భారీగా పోలీసు సిబ్బందిని మోహరించారు. ఊరేగింపు చార్మినార్‌కు చేరుకున్నప్పుడు హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్



'ధట్టి'ని సమర్పించారు. పురానీ హవేలీ మీదుగా ఊరేగింపు సాగుతున్నప్పుడు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ కూడా 'ధట్టి'ని సమర్పించారు. ఆయనతో పాటు ఆయన కుమారుడు మహమ్మద్ అసదుద్దీన్, తెలంగాణ వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీ ఉన్నారు. ధర్మాన్ని పాటించడం, అన్యాయానికి వ్యతిరేకంగా నిలబడటం అనే ఇమామ్ హుస్సేన్ శాశ్వత సందేశం అన్ని వర్గాల ప్రజలకు స్ఫూర్తినిస్తూనే ఉంటుందని మంత్రి అన్నారు. తెలంగాణ ప్రజల కోసం శాంతి, మత సామరస్యం, శ్రేయస్సును కోరుతూ ఆయన ప్రార్థించారు.
శతాబ్దానికి పైగా ఉన్న సంప్రదాయాన్ని కొనసాగిస్తూ, ముకర్రం జా ట్రస్ట్ ఫర్ ఎడ్యుకేషన్ అండ్ లెర్నింగ్ ట్రస్టీ నవాబ్ అబుల్ ఫైజ్ ఖాన్, పురానీ హవేలీలోని పీలీ గేట్ (ఎల్లో గేట్) వద్ద పవిత్రమైన 'బీబీ-కా-ఆలం'కు 'ధట్టి' , 'నజ్రానా'ను సమర్పించారు. ఆయనతో పాటు చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ , తదితరులు ఉన్నారు. రెండవ నిజాం, నవాబ్ మీర్ నిజాం అలీ ఖాన్ బహదూర్ (ఆసఫ్ జా 2) పాలనలో నిర్మించబడిన చారిత్రక 'పీలీ గేట్' (పసుపు రంగు ద్వారం), 'హవేలీ-ఎ-ఖదీమ్' (పురానీ హవేలీ)కి అసలైన ప్రధాన ద్వారంగా ఉండేది. ఇది ప్రారంభ ఆసఫ్ జాహీ కాలం నాటి అత్యంత పురాతన ,ముఖ్యమైన నిర్మాణపరమైన వారసత్వ ప్రదేశాలలో ఒకటి.

# సిసి రోడ్ పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ - కంది శైలజ శ్రీకాంత్

**సికింద్రాబాద్/జూన్ 26(జర్నలిస్ట్ వార్త)**
బౌద్ధనగర్ డివిజన్ రోడ్ నెంబర్ 06 లో జరుగుతున్న సిసి రోడ్ పనులను శుక్రవారం మాజీ కార్పొరేటర్ కంది శైలజ శ్రీకాంత్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్థానికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పనులను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు. అదేవిధంగా పనుల్లో నాణ్యతమైన విషయంలో రాజీపడకూడదాని పేర్కొన్నారు. అనంతరం డివిజన్ పరిధిలోని రోడ్ నెంబర్ 02 లో మాజీ డిప్యూటీ స్పీకర్ సికింద్రాబాద్ శాసనసభ్యులు తీగుళ్ళ పద్మారావు గౌడ్ ఆదేశాల మేరకు ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు ఎన్యూమరేటర్ ఫారాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కంది నారాయణ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.





# ఓటు హక్కు వినయోగించుకుందాం ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకుందాం

## బిఆర్ఎస్ నాయకురాలు - మురారి స్మితా కోటేష్ గౌడ్

**సికింద్రాబాద్/జూన్ 26(జర్నలిస్ట్ వార్త):**
ఓటు హక్కు వినయోగించుకుందాం ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకుందామని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ మహిళ నాయకురాలు మురారి స్మితా కోటేష్ గౌడ్ అన్నారు. శుక్రవారం మాజీ డిప్యూటీ స్పీకర్ సికింద్రాబాద్ శాసనసభ్యులు తీగుళ్ళ పద్మారావు గౌడ్ ఆదేశాల మేరకు తార్నాక డివిజన్ పలు ప్రాంతాల్లో ఇంటి ఇంటికి తిరుగుతూ బిఎల్ఓ అఖిల తో కలిసి ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...అలాగే ఓటరు గుర్తింపు కార్డు వివరాలను పరిశీలించి, కొత్త ఓటరు నమోదుతో పాటు పేర్లు, చిరునామా, ఇతర వివరాల సవరణలు మరియు నవీకరణలకు సంబంధించిన దరఖాస్తులను ప్రజలకు వివరించి, అవసరమైన సహాయాన్ని అందించారు. అదేవిధంగా ఈ కార్యక్రమం ద్వారా ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవడంతో పాటు, తమ వివరాలను సక్రమంగా నవీకరించుకోవాలని మురారి స్మితా కోటేష్ గౌడ్ పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో ఓటరు నమోదు ప్రతి పౌరుడి బాధ్యత అని ఆమె పేర్కొన్నారు.



# ధర్మసాగర్‌లో రూ.42 లక్షల సీసీ రోడ్డు పనులకు శ్రీకారం



**ధర్మసాగర్ / హనుమకొండ బ్యూరో, జూన్ 26 (జర్నలిస్ట్ వార్త):** గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ధర్మసాగర్ గ్రామంలో రూ.42 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం గ్రామ సర్పంచ్ మాచర్ల జ్యోతి-ఏలియా శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) నిధుల ద్వారా ఈ పనులు చేపట్టడం గ్రామాభివృద్ధికి మరో ముందడుగుగా స్థానికులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాచర్ల జ్యోతి-ఏలియా మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గ్రామ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా అంతర్గత రహదారులను సీసీ రోడ్లుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. నాణ్యమైన రోడ్ల నిర్మాణంతో వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులు తగ్గడంతో పాటు గ్రామ సౌందర్యం కూడా మెరుగుపడుతుందని పేర్కొన్నారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా తాగునీరు, డ్రైనేజీ, వీధి దీపాలు, అంతర్గత రహదారులు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ప్రజల సహకారంతో గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, వార్డు సభ్యులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# డిసి తండాలో నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు



**వర్ధన్నపేట/జూన్ 26(జర్నలిస్ట్ వార్త);**
వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని డిసి తండాలో చి. అంగోత్ శ్రీధర్, సరిత దంపతుల వివాహ రిసెప్షన్ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన నూతన వధూవరులను శాలువాతో సత్కరించి, అక్షింతలు వేసి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలో మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యం, ఏఎంసీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య పాల్గొన్నారు. వారితో పాటు జిల్లా సీనియర్ నాయకులు పోషాల వెంకన్న గౌడ్, ఈగ దామోదర్, కౌన్సిలర్లు బెజ్జం పాపారావు, దేవేందర్, నాయకులు నాను నాయక్, భీమా నాయక్, తుల్ల రవి, కొండేటి సాంబయ్య, తాళ్లపెల్లి యాదగిరి గౌడ్, మాజీ సర్పంచ్ జిత్రామ్ నాయక్ తదితరులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.